

సదరం శిబిరం వాయిదా

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసుపత్రిలో ఈనెల 17, 18న నిర్వహించాల్సిన సదరం శిబిరాన్ని వాయిదా వేస్తున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడడంతో 17న నిర్వహించాల్సిన కంటి చూపు, 18న నిర్వహించాల్సిన మానసిక వికలాంగత్వానికి సంబంధించిన శిబిరాన్ని వాయిదా వేశామన్నారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు చేయండి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి



గంగాధరలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, వాణినికేతన్ డిగ్రీ కళా శాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ధన్గర్‌వాడీ), గంగాధర మండల కేంద్రంలోని జడ్పీ ఉన్న త పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేం ద్రాలను పరిశీలించారు. ఈనెల 27న జరిగే ఎన్నికల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ సంఖ్యను ఓటర్లకు కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో వెలుతురు ఉండేలా చూడాలని, దివ్యాంగ ఓటర్ల కోసం తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రతి ఓటరు స్వేచ్ఛగా ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్లు నరేందర్, అనుపమ, ఎంపీడీవో రాము, ఆర్‌ఐలు శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

పాలక వర్గానికి 'సహకారం'

- సహకార సంఘాల పదవీకాలం ఆరు నెలలు పొడిగింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న సంఘ నేతలు
- స్థానిక సంస్థల తర్వాతే ఎన్నికలు





(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఫిబ్రవరి 14తో పాలకవర్గాల గడువు ముగియగా మరో ఆరు నెలలపాటు వారి పదవీ కాలాన్ని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకవర్గం పదవీ కాలం పొడిగించారు. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)కి పొడిగింపు లభించ లేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో 131 ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి. కరీంనగర్ జిల్లాలో 25 సంఘాలు పనిచేస్తున్నాయి. ప్రస్తుతం ఈ సంఘాల పాలకవర్గాల పదవీకాలం పొడిగించడంతో స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసిన తర్వాతే వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించే అవకాశమున్నది.

● పరీక్షలు, కుల గణన సర్వే

బీసీ కుల గణన సర్వేలో పాల్గొనని వారికి మరోసారి వారి వివరాలు సమర్పించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈనెల చివరి వారంలో ఈ గడువు ముగియనుండడంతో పూర్తి వివరాలతో మళ్లీ కులాల వారీగా జనాభా, ఓటర్ల వివరాలు ప్రకటించి రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల ఖరారు చేయనున్నది. బీసీ రిజర్వేషన్ల ఖరారు తర్వాత గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్షలు ఇప్పటికే ప్రారంభం కాగా పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ తదితర పరీక్షలు ఏప్రిల్ మాసం చివరి వరకు జరుగనున్నాయి. అన్ని రకాల పరీక్షలు ముగిసిన తర్వాతే వర్షాకాలం ప్రారంభంలో జూన్, జూలై మాసాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారని భావిస్తున్నారు. అప్పటి వరకు ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి గ్రామీణ ప్రాంతాల్లో సానుకూల వాతావరణం నెలకొన్న తర్వాత ప్రభుత్వం ఎన్నికలకు వెళ్తుందని ప్రచారం జరుగుతున్నది. జూన్, జూలై మాసాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయితే ఆగస్టులోకానీ, సెప్టెంబరు నెలలో కానీ సహకార సంఘాల ఎన్నికలు నిర్వహిస్తారని చెబుతున్నారు. అప్పటికి మరో విడత రైతు భరోసా నిధులు వేసే సీజన్ వస్తుంది. రెండు సీజన్లు రైతు భరోసా నిధులు విడుదల కావడం, ఇప్పటికే రైతు రుణ మాఫీ చివరి దశకు రావడం కూడా సహకార సంఘాల ఎన్నికలకు కలిసి వస్తుందని భావిస్తున్నారు.

● పొడిగింపుపై హర్షం

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలకవర్గ పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలలపాటు పొడగించడంపై జిల్లా సహకార కేంద్రబ్యాంకు అధ్యక్షుడు కొండూరు రవీందర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా సహకార సంఘాల పక్షాన ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. సహకార సంఘాల ద్వారా సభ్యులకు నిరంతరం సేవలందించేందుకు వీలుగా ఆరు నెలలపాటు పదవీకాలాన్ని పొడగించడం హర్షణీయమని జిల్లా సహకార సంఘాల అధ్యక్షుల ఫోరం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు శనివారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఫోరం అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి, కేడీసీసీబీ బ్యాంకు పాలకవర్గసభ్యుడు వుచ్చిడి మోహన్‌రెడ్డి, ఏనుగు తిరుపతిరెడ్డి, విశాల సహకార పరపతి సంఘం అధ్యక్షుడు ఎ.రాధకిషన్‌రావు, మానువాడ, ధర్మారం, మానకొండూర్, చిగురుమామిడి పీఏసీఎల అధ్యక్షుడు వి దుర్గారెడ్డి, కె శ్రీకాంత్‌రెడ్డి, ఎన్ గోవిందరెడ్డి, జె వెంకటరమణారెడ్డి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని పలు చోట్ల సహకార సంఘాల ప్రతినిధులు, సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకాలు చేశారు.

ఇసుక క్వారీని పరిశీలించిన భూగర్భ గనుల శాఖ ముఖ్య కార్యదర్శి

వీణవంక, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు సమీపంలోని ఇసుక క్వారీని రాష్ట్ర భూగర్భ గనుల పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, డైరెక్టర్ బీఆర్వీ సుశీల్ శనివారం సందర్శించారు. ఇసుక నిల్వల రికార్డులు, సీసీ కెమెరాలు, వే బ్రిడ్జి పనితీరును పరిశీలించారు. రోజువారీగా ఇసుక రవాణా వివరాలకు సంబం ధించిన రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఇసుక అక్రమ రవాణాను అరిక ట్టేందుకు ఏర్పాటు చేసిన చెక్ పాయింట్లను పరిశీలించారు. కార్య క్రమంలో అసిస్టెంటు జియాలజిస్ట్ వెంకటేశ్వరావు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డుకు చెత్తను తరలించొద్దు

● మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చాహత్‌భాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. శనివారం ఆమె నగరంలోని 7,31 డివిజన్లలో పర్యటించి, పారిశుధ్య పనులను తనిఖీ చేసి స్థానికులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం మున్సిపల్ సమావేశ మందిరంలో ఆ రెండు డివిజన్లకు చెందిన వార్డు ఆఫీసర్లు, జవాన్లు, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, పారిశుధ్య జవాన్లు, సమ్మైక్య సంఘాల లీడర్లు, ఆర్పీలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సాలిడ్, ప్లాస్టిక్ మేనేజిమెంట్ ప్రక్రియలో భాగంగా రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ పద్ధతిలో తడి, పొడిచెత్త, హాజర్డర్ వేస్టు సెగ్రిగేషన్‌పై పలు సూచలను చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ ప్రక్రియతో రెండు డివిజన్లలో ఉత్పత్తి అయిన చెత్తను రిసోర్సు పార్కులోని ట్రిపుల్ ఆర్ సెంటర్‌కు తరలించాలన్నారు. ప్రతి ఇంటి నుంచి స్వచ్ఛ ఆటోల కార్మికులు తడి పొడిచెత్తతో పాటు ఇతర వ్యవర్థాలను వేరు చేసి తరలించాలని ఆదేశించారు. మంగళ వారం, శుక్రవారం రెండు రోజులు పొడిచెత్తను ఇళ్ల నుంచి సేకరించి ట్రిపుల్ ఆర్ సెంటర్‌కు తరలించా లన్నారు. ప్రతి రోజు వార్డు ఆఫీసర్లు, జవాన్లు తప్పకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సమ్మైక్య సంఘాల లీడర్లు, ఆర్పీలు ఈ అంశాన్ని ప్రత్యేక ఏజెండాగా చేర్చుకొని మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి నుంచి వేరు చేసిన తడిచెత్తను వర్మీకంపోస్టు తయారీకి వినియోగించుకోవాలని సూచించారు.

● వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి

వేసవిలో నగర ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె 31వ డివిజన్‌లో పర్యటించి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. నల్లానీరు తక్కువ వస్తున్నాయని మహిళలు తెలుపడంతో ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. పైపులైను మరమ్మతులు చేపట్టాలని, లీకేజీలను అరిక ట్టాలని సూచించారు. డివిజన్‌లో అక్ర మంగా భవన నిర్మాణాలు చేస్తున్నారంటూ స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా టౌన్‌ప్లానింగ్ అధికారులను వెంటనే పిలిపించి, డాక్యుమెంట్లను పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్ పాల్గొన్నారు.



యూజీసీ నూతన ప్రతిపాదనలతో ప్రజాస్వామ్యానికి ప్రమాదం

భగత్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): యూజీసీ నూతన ప్రతిపాదనలతో ప్రజాస్వామ్యానికి ప్రమాదమని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేస్తే ప్రత్యక్ష దాడులు చేస్తామని హెచ్చరించారు. యూజీసీ నూతన ప్రతిపాదనలు యూనివర్సిటీలను నిర్వీర్యం చేసే విధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తు యూనివర్సిటీల ప్రతిపత్తిని దెబ్బతీస్తున్న బీజేపీ ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి బీజేపియేతర ముఖ్యమంత్రులను ఏకం చేసి ఉద్యమించాలన్నారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్‌రెడ్డి, అరవింద్, మచ్చ పవన్, శ్రావణ్ పాల్గొన్నారు.

'రోల్ ప్లే'లో చిన్నారుల ప్రతిభ

- కలెక్టర్ సహకారంతో నటనలో శిక్షణ పొందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- చిల్డ్రన్ థియేటర్ ఫెస్ట్‌లో ప్రదర్శన


6లో..

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు

8లో..

లక్ష్యానికి దూరంగా..

- ఆస్తి పన్ను వసూళ్లలో జాప్యం
- సమీపిస్తున్న గడువు
- ఇప్పటి వరకు వసూలు చేసింది 52 శాతం మాత్రమే



కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ అధికారులకు ఆస్తి పన్ను వసూలు పెద్ద సమస్యగా మారింది. ప్రతి సంవత్సరం జనవరి నెలాఖరుకు 70 శాతానికి మించి పన్నులు వసూలయ్యేవి. ఈ యేడు ఇప్పటి వరకు 52శాతం మాత్రమే వసూలయ్యాయి. నగరపాలక సంస్థ పరిధిలోని 84వేల పైచిలుకు నివాస, వాణిజ్య గృహాలకు సంబంధించిన ఆస్తి పన్నుల ద్వారానే అధిక ఆదాయం సమకూరు తుంది. ఆస్తి పన్నుల ద్వారా ఈ యేడు 43 కోట్ల రూపాయలు వస్తాయని అంచనా వేసి వాటిని మార్చి 31లోగా వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రజాపాలన, సమగ్ర ఇంటింటి సర్వే వంటి అదనపు బాధ్యతలను అప్పగించడంతో ఉద్యోగులు ఆస్తిపన్ను వసూళ్ళలప సమయాన్ని కేటాయించలేక పోయారు. ఇప్పటి వరకు 20 కోట్ల రూపాయల పన్నులు మాత్రమే వసూలయ్యాయి.

● పన్ను ఆదాయం పెరుగుతుందని అంచనా

కొత్తపల్లి మున్సిపాలిటీ, చింతకుంట, మల్కాపూర్, బొమ్మకల్, గోపాల్‌పూర్, దుర్శేడ్ గ్రామాలను కూడా విలీనం చేయడంతో ఆస్తిపన్నుల ద్వారా మరింత ఆదాయం వస్తుందని అంచనా వేశారు. మున్సిపాలిటీ, గ్రామపంచాయతీల్లో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది కార్పొరేషన్‌లో చేరారు. ఒక్కో డివిజన్‌కు వార్డు ఆఫీసర్‌ను నియమించారు. వార్డు ఆఫీసర్లకు ఆస్తిపన్ను వసూళ్ల బాధ్యతతో పాటు ఆ డివిజన్ సమస్యలు, ఇతర విధులను అప్పగించారు. అయినా ఆస్తిపన్ను వసూళ్లు ఆశించిన మేరకు కావడం లేదు. మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవ త్సరం పన్నులే కాకుండా బకాయిలు కూడా పేరుకు పోవడంతో వాటి వసూళ్ళ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు.

● అదనపు బాధ్యతలతో ఉద్యోగులు సతమతం

ఆర్థిక సంవత్సరం మరో 50 రోజుల్లో ముగియనుండగా ఏడాది మొత్తంలో 52శాతం పన్నులు వసూలు కాగా, ఈ 50 రోజుల్లోనే ఎలా వసూలు అవుతాయని ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వ భవనాలకు సంబంధించిన బకాయిలు కోట్లలో ఉన్నాయి. బకాయిల వసూళ్లకు నోటీసులు జారీ చేయాలని, అవసరమైతే చట్టపరమైన అన్ని చర్యలు చేపట్టి బకాయిలను వసూలు చేయాలని కలెక్టర్, కమిషనర్ ఆదేశించినా క్షేత్రస్థాయిలో వసూళ్లలో వేగం పెరుగడం లేదు. గుదిబండగా మారుతున్న బకాయిలు ఓవైపు... అదనపు బాధ్యతలు మరోవైపు ఆస్తిపన్నుల వసూళ్లకు ఆటంకంగా మారాయని మున్సిపల్‌రెవెన్యూ ఉద్యోగులు వాపోతున్నారు. ఆస్తిపన్ను వసూలు కాక పోవడంతో బల్దియా ఆర్థిక లావాదేవీలపై ప్రభావం పడుతోంది. ఈనేపథ్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పన్నులు వసూలు చేస్తే తప్ప వసూలు అవడం కష్టమని చెబుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణ చర్యలు కరువు

తీగలవంతెన చౌరస్తాలో భారీగా నిలిచిపోయిన వాహనాలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బైపాస్‌రోడ్‌లోని తీగల వంతెన చౌరస్తా వద్ద శనివారం సాయంత్రం భారీ భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. చౌరస్తాకు నలువైపులా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవటంతో వాహనదారులతో పాటు స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారానికి రెండు సార్లు ఇదేవిధంగా ఇక్కడ ట్రాఫిక్ స్తంభించిపోతున్నదని హౌసింగ్‌బోర్డు కాలనీవాసులు, ఆటోనగర్ వాసులు, వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శనివారం సాయంత్రం తీగల వంతెన వద్ద నాలుగు రోడ్లపై అరకిలోమీటరు దూరం వరకు వాహనాలు నిలిచిపో యాయి. దాదాపు 40 నిమిషాలపాటు వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకు న్నారు. తీగలవంతెన వద్ద తరచుగా ట్రాఫిక్ స్తంభిస్తున్నా పోలీసులు నియంత్రణ చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వస్తు న్నాయి. తీగల వంతెన చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవ టంతోపాటు పోలీసులు కనిపిం చడం లేదు. ఈ చౌరస్తా నుంచి పెద్ద సంఖ్యలో వాహ నాలు వెళుతుంటాయి. వాటిలో భారీ వాహనాలు ఎక్కువగా ఉంటాయి. నాలుగు వైపుల నుంచి ఒకేసారి వాహనాలు వెళ్లే క్రమంలో స్తంభించి ఇబ్బంది తలెత్తుతున్నది. ఈ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయడం లేదా ట్రాఫిక్ పోలీసులకు విధులను కేటాయిస్తేనే సమస్య పరిష్కారం అవు తుందని అభిప్రాయం వ్యక్తమవుతున్నది. సాధారణంగా వారాంతపు సెలవు దినాల్లో నగర వాసులు తీగలవంతెనను చూసేందుకు ద్విచక్ర వాహనాలు, కార్లలో సాయంత్రం వేళ భారీగా తరలి వెళుతుంటారు. ఇదే సమయంలో మానకొండూర్ నుంచి కరీంనగర్‌కు, గోదావరిఖనివైపు, హైదరాబాద్ నుంచి గోదావరిఖని వైపు, గోదావరిఖని నుంచి హైదరాబాద్, వరంగల్ వైపునకు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండంతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీనికితోడు భారీ వాహనాలు రాత్రి వరకు నగరంలోకి అనుమతించకపోవడంతో కొందరు ఇక్కడే రోడ్డు పక్కన పార్క్ చేసుకోవడం కూడా వాహనాలు రాకపోకలకు ఆటంకంగా మారుతున్న ది. కొన్ని ప్రైవేట్ బస్సులు ఇదే చౌరస్తా వద్ద నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటాయి. దీంతో వాహ నాల రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. పోలీసు అధికారులు స్పందించి తీగలవంతెన చౌరస్తాలో వాహనాల క్రమబద్ధీకరణ చర్యలు తీసుకోవాలని నగరవాసులు, వాహనదారులు కోరుతున్నారు.



తీగల వంతెన చౌరస్తా వద్ద ట్రాఫిక్ జాం



ట్రాఫిక్ జాం కావడంతో నిలిచిపోయిన వాహనాలు



సెల్‌ఫోన్ దొంగ అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్‌ను దొంగిలించిన ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన యువకుడు బొడ్డు నిఖిల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై రమాకాంత్ శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని రాగట్లపల్లికి చెందిన నూకల సాయివంశీ ఈ నెల 13న అనారోగ్యంతో బాధపడుతూ మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. తన రూ.25 వేల విలువైన సెల్‌ఫోన్‌ను పడకపై ఉంచి మూత్రశాలకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి సెల్‌ఫోన్ కనిపించలేదు. దాంతో సాయివంశీ పెద్దనాన్న మందాటి రాము పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మండల కేంద్రంలోని కొత్త బస్టాండు ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన యువకుడు నిఖిల్‌ను అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. అతడిని విచారించగా సాయివంశీకి సంబంధించిన సెల్‌ఫోన్‌ను తానే దొంగిలించానని నిఖిల్ అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి కేసులో యువకుడి అరెస్ట్

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగమరెడ్డిపల్లి గ్రామ శివారులో గంజాయి అమ్మడానికి వచ్చిన పున్ని వేణు అనే యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల సీఐ మొగిలి, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. గొల్లపల్లి గ్రామానికి చెందిన వేణు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జల్సాలకు అలవాటు పడ్డాడు. గంజాయి అమ్మడం ద్వారా డబ్బులు సంపాదించవచ్చనే ఆలోచనతో శనివారం గంజాయి తీసుకొని ఇల్లంతకుంటకు వస్తుండగా అరెస్ట్ చేసినట్టు తెలిపారు. నిందితుడి వద్ద 600 గ్రాముల గంజాయి, మొబైల్ స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపాక గ్రామానికి చెందిన రొండ్ల కిరణ్ రెడ్డి(38) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గ్రామస్థుల వివరాలు ప్రకారం.. కిరణ్‌రెడ్డి శుక్రవారం అర్ధరాత్రి సిద్దిపేట నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నాడు. వాహనానికి అడ్డుగా అడవిపంది రావడంతో కిందపడి గాయాల పాలయ్యాడు. కిరణ్‌రెడ్డిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

పెగడపల్లి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన కంబాల హారిక(30)హైదరాబాదు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పెగడపల్లి ఎస్సై సీహెచ్. రవికిరణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు ఈ నెల 13న హారిక వ్యక్తిగత కారణాలతో ఆమె 10ఏళ్ల కుమారుడు కృష్ణంత్, 8ఏళ్ల కూతురు మయాంతలక్ష్మి ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగారు. చికిత్స కోసం హైదరాబాదుకు తరలించగా చికిత్స పొందుతూ హారిక మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుమారుడు, కూతురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

మల్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బాలికను తీసుకెళ్లిన ఓ యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. జగిత్యాల మండలానికి చెందిన ఓ బాలిక(17) తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లో ఉన్న బాలిక శనివారం వేకువజామున చూసే వరకు కనిపించకపోడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతర్గాంకు చెందిన యువకుడిపై అనుమానాలు వ్యక్తం చేయడంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.



కమెడియన్‌గా నటించాలని ఉంది

- విష్ణుగుప్త, జీహెచ్‌ఎస్, రాంనగర్

సీరియల్స్‌లో, సినిమాల్లో నటిస్తా... విలన్, కమెడియన్‌గా నటించాలని ఆసక్తిగా ఉంది. ప్రేమ, బాధ, దుఃఖం, కోపం, ధీరత్వం, అద్భుతం వంటి అనేక అంశాల్లో శిక్షణ ఇచ్చారు.



స్టేజి ఫియర్ పోయింది..

- జి శశాంక్, ఎలగందుల మోడల్ హైస్కూల్

అమ్మ ప్రోత్సాహంతో నటనలో శిక్షణ పొందాను. స్టేజ్ ఫియర్ పోయింది. హీరోగా పాత్రలు ధరించాలని ఉంది. శిక్షణ బాగా అనిపించింది.

‘రోల్ ప్లే’లో చిన్నారుల ప్రతిభ

కలెక్టర్ సహకారంతో నటనలో శిక్షణ పొందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

● చిల్డ్రన్ థియేటర్ ఫెస్ట్‌లో ప్రదర్శన

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కళ అందరిలో దాగి ఉంటుంది. దాన్ని వెలికితీసే సందర్భాలు, ప్రోత్సాహం, శిక్షణ ఉంటే ఆయా కళలు బహిర్గతమవుతాయి. కలెక్టర్ పమేలా సత్పతి సూచనలతో కరీంనగర్‌కు చెందిన మోడ్రన్ యాక్టింగ్ స్కూల్ ఆఫ్ కరీంనగర్ (మాస్క్) చైర్మన్ అనసూరి భూనాథాచారి ఆధ్వర్యంలో 45 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రోల్ ప్లే విభాగంలో శిక్షణ పొందారు. ఈ మేరకు శనివారం కళాభారతిలో జరిగిన చిల్డ్రన్ థియేటర్ ఫెస్టివల్‌లో చిన్నారులు నేర్చుకున్న నటనను ప్రదర్శించి అందరినీ అబ్బుర పరిచారు.

● అలరించిన ప్రదర్శనలు

కరీంనగర్ కళాభారతిలో చిల్డ్రన్ థియేటర్ ఫెస్ట్-2025 శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ పమేలా సత్పతి హాజరై చిన్నారుల ప్రదర్శనను తిలకించారు. అద్భుత నటనతో ఆకట్టుకున్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ధైర్యాన్ని, సామాజిక స్పృహను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మాస్క్ చైర్మన్ అనసూరి భూనాథాచారి, సీకేటీ అధ్యక్ష కార్యదర్శులు తిప్పర్తి ప్రభు, మంచాల రమేశ్, తిప్పర్తి రమేశ్, జి కృపాదానం, గోపాల్‌రావు, గాజుల రవీందర్, నాంపెల్లి శ్రీనివాస్, ఎంఏ మతీన్, అయిలు రమేశ్, మాడిశెట్టి గోపాల్, చకిలం స్వప్న, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



బాలికల రోల్ ప్లే ప్రదర్శన



కళాభారతిలో చిన్నారుల రోల్ ప్లే ప్రదర్శన



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

మంచి స్పందన వచ్చింది

- అనసూరి భూనాథాచారి, మాస్క్ చైర్మన్



తొలుత కలెక్టర్ మేడం చెప్పాక భయమేసింది. పిల్లలు వస్తారో రారో అనుకున్న. రెండు మూడు రోజుల్లోనే విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చింది. ప్రోత్సాహం, సహకారం అందించిన కలెక్టర్‌కు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు.



పాఠశాల తరుపున ప్రోత్సాహం అందించారు

- జి దివ్య, జీహెచ్‌ఎస్ సప్తగిరికాలని

అనతికాలంలో శిక్షణనిచ్చిన మాస్క్‌కు కృతజ్ఞతలు. ఇంకా నటన నేర్చుకోవాలనుకుంటున్నాను. పాఠశాల తరఫున ప్రోత్సాహం అందించారు. మదర్ క్యారెక్టర్ అంటే ఇష్టం. సీరియల్స్, షార్ట్ ఫిల్మ్స్, సినిమాల్లో నటించాలని ఉంది.

ఏ పాత్ర అయినా చేస్తా..

- ఎస్ కావ్య (10వ) జీహెచ్‌ఎస్ సప్తగిరికాలని



ఇన్నాళ్లు మాలో దాగిన కళ బయటకొచ్చింది. ఏ పాత్ర అయినా చేసేస్తా. ఇదివరకంటే ఇప్పుడు ధైర్యం, యాక్టీవ్‌గా మాట్లాడుతున్నా. ఇంట్లో, స్కూల్లో, నా తోటి మిత్రుల ప్రోత్సాహంతో నటన నేర్చుకున్నా.

ఆన్‌లైన్ గేమ్స్‌కు ఆటో డ్రైవర్ బలి

● రూ.50 లక్షల వరకు అప్పు
● చెల్లించలేక ఆత్మహత్య



చొప్పరి దేవేందర్ (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా యైటింక్లయిన్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ చొప్పరి దేవేందర్ (35) ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దేవేందర్ ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారాడు. కొన్నేళ్లుగా ఆడుతూ సుమారు రూ.50 లక్షల వరకు అప్పులు చేశాడు. ఆన్‌లైన్ గేమ్స్‌లో డబ్బులు పోగొట్టుకోవడం, అప్పులు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులతో శుక్రవారం రాత్రి ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కిందకు దించి హుటాహుటిన గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స చేసేందుకు నిరాకరించడంతో దేవేందర్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే దేవేందర్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు దేవేందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడిపై తండ్రి ఫిర్యాదు

మల్యాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్‌కు చెందిన గడ్డం రాజచంద్రశేఖర్‌రెడ్డికి కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక ఇంట్లో వారిని, చుట్టు పక్కల వారిపై దాడులకు పాల్పడుతున్నాడు. దీంతో అతడి తండ్రి మహిపాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి రాజచంద్రశేఖర్‌రెడ్డిని న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

● ఎండుతున్న పంటలు ● ఆందోళనలో రైతులు



ఎండుతున్న వరిపంటను చూపుతున్న రైతులు

గంభీరావుపేట ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్తాఫానగర్ గ్రామ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి పంటలు ఎండుతున్నాయంటూ శనివారం రైతులు ఆందోళన చేపట్టారు. లోవోల్టేజీ కారణంగా నెలలో రెండు సార్లు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో పంటలకు సాగునీటి ఇబ్బంది తలెత్తిందని వాపోయారు. చిరుపొట్ట దశలో ఉన్న వరి పంటలకు సాగునీరు అందే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తక్షణమే మరమ్మతులు చేపట్టి పంటలను కాపాడాలని కోరారు. ఈ ఆందోళనలో రైతులు దేవయ్య, రాజయ్య, భూమయ్య, రాములు, శ్రీనివాస్, శేఖర్, కృష్ణకాంత్ తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాలి

సిరిసిల్ల టౌన్ : ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి పంటలు ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గంభీరావుపేట మండలం ముస్తాఫానగర్ గ్రామ రైతులు ఆరోపించారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో రైతులు మాట్లాడారు. ముస్తాఫానగర్‌లో 100 కేవీ కెపాసిటీ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై 130 కేవీ కెపాసిటీ భారం పడుతోందన్నారు. అనుమతి లేకుండా ఉన్న కనెక్షన్లు తొలగించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. సెస్ అధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో రైతులు ఎండీ అక్బర్ ఖాన్, శివంది దేవయ్య, దోమకొండ భూమయ్య, కంటె దేవయ్య, దోమకొండ దేవయ్య, శివంది శ్రీనివాస్, బోదాస్ లక్ష్మయ్య, శివుని రాములు, శివంది కిషన్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు

తంగళ్లపల్లి, (సిరిసిల్ల రూరల్) ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం టెక్స్‌టైల్ ఇందిరాపార్కులో శనివారం కుక్కలు దాడి చేయడంతో పలువురు గాయపడ్డారు. ఇందిరమ్మ కాలనీ గ్రామంలో రోడ్డుపై ఆడుకుంటున్న ఓగులాపూర్ గ్రామానికి చెందిన చెల్ల శ్రీవర్ధన్(2)పై కుక్కలు దాడి చేశాయి. అడ్డుకునేందుకు వెళ్లిన ఆకుబత్తిని రుక్మంబాయి, అనురాధ, గౌడ సాన్విలతో పాటు మరికొందరిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. కుక్కల దాడిలో గాయపడ్డ వీరిని గ్రామస్థులు సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

● ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లో పోలీసుస్టేషన్ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్రవాహనంపై వెళ్తున్న మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్ గ్రామ కారోబార్ బొల్లం శ్రీనివాస్‌ను, హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. శ్రీనివాస్‌కు తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు.

కరెంట్ మోటార్ల దొంగల అరెస్టు

● వివరాలు వెల్లడించిన ఎస్పీ అశోక్ కుమార్



పోలీసులు స్వాధీనం చేసుకున్న కరెంటు మోటార్లు

మెట్‌పల్లి టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను శనివారం పోలీసులు పట్టుకున్నారు. శనివారం పట్టణంలోని సర్కిల్ కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అశోక్‌కుమార్ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా కోరుట్ల, మెట్‌పల్లి సర్కిల్ పోలీస్ పరిధిలో తాళం వేసిన ఇళ్లలో, వ్యవసాయ మోటార్లు అధిక సంఖ్యలో దొంగతనాలు జరుగుతున్నాయని నిందితులను పట్టుకునేందుకు మెట్‌పల్లి డీఎస్పీ రాములు, సీఐ నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో ఓ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు సీసీ పుటేజీలు, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలంలోని మేడిపల్లి క్రాస్ రోడ్డు వద్ద శనివారం ఎస్సై అనిల్ వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పేర్కొన్నారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన కుంచెపు వెంకటేష్, నిజామాబాద్ జిల్లా ఎడపల్లిలోని ఎఆర్‌పి క్యాంపునకు చెందిన సూర్యవంశీ సాయికుమార్ ప్రస్తుతం రాఘవపేట గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్, మెట్‌పల్లికి చెందిన స్క్రాప్ వ్యాపారి అబ్దుల్ బారి ముగ్గురు కలిసి ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, మల్లాపూర్, కథలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలలో దొంగతనాలు చేసినట్లు వెల్లడించారు. వీరి వద్ద నుంచి 6 లక్షల విలువ గల 1 మోటార్ సైకిల్, 30 కిలోల రాగి వైరు, 30 వ్యవసాయ కరెంట్ మోటార్లు 5 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. తక్కువ సమయంలో కేసు ఛేదించిన మెట్‌పల్లి డీఎస్పీ రాములు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, మల్లాపూర్ ఎస్‌ఐలు అనిల్, కిరణ్, రాజు, సిబ్బంది చైతన్య, కిరణ్, అనిల్, సాధునాయక్, మారుతిలను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు

కూరగాయల సేద్యంతో అదనపు ఆదాయం పొందుతున్న రైతు గోపాల్



సాగు చేసిన కూరగాయాల తోట

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అతడో సాధారణ రైతు.. సంప్రదాయ పద్ధతిలో ఏటా వరి సాగుతో నష్టాలను చవిచూశాడు. దీంతో ఎలాగైన కష్టాల నుంచి గట్టెక్కాలని భావించాడు. ఉన్న కొద్దిపాటి భూమిలో కూరగాయలు పండించాలని నిర్ణయించుకున్నాడు. తనకున్న ఆరు గుంటల్లో 12 రకాల పంటలను వేశాడు. పెట్టుబడి పోను గత ఆరునెలల్లో రూ.30 వేల వరకు ఆదాయం సమకూరిందని హర్షం వ్యక్త చేస్తున్నాడు ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన రైతు అంతెర్పుల గోపాల్.

● వేర్వేరు పంటల సాగు.

మండల కేంద్రానికి చెందిన రైతు అంతెర్పుల గోపాల్ గ్రామ శివారులో తనకున్న 11 గుంటల్లో వరి పంటను సాగు చేసినా దిగుబడి అంతంత మాత్రమే రావడంతో ఆలోచనలో పడ్డాడు. కుటుంబ పోషణ భారంగా మారినా వ్యవసాయంపై ఉన్న మక్కువతో సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాడు. మరో ఎకరం భూమిని కౌలుకు తీసుకుని వరి పంటను సాగు చేసినా ఫలితం లేకుండాపోయింది. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే కూరగాయల పంటల సాగును ఐదేళ్ల క్రితం ప్రారంభించాడు. 1.11 ఎకరాల భూమిలో 1.05 ఎకరాల్లో వరి పంటను, మిగిలిన 6 గుంటల్లో 12 రకాల కూరగాయల పంటలను సాగు చేశాడు. గుంట విస్తీర్ణంలో మిరప, మరో గుంటలో బెండ, మిగతా భూమిలో అర గుంట చొప్పున నాలుగు గుంటల్లో టమాట, బీర, కాకర, వంకాయ, గోరుచిక్కుడు, అల్చింత, పాలకూర, మెంతి, కొత్తిమీరతో పాటు ఒడ్డుకు రెండు వైపులా సోరకాయ పంటలను పండిస్తున్నాడు. 12 రకాల పంటలకు గాను దున్నడం, విత్తనాల ఖర్చులకు రూ.10 వేల వరకు వెచ్చించాడు. రెండు రోజులకొకసారి తడులు పెడుతున్నాడు. పండిన కూరగాయలను తెంపి మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో జరిగే బుధ, శుక్ర, శనివారాల్లోని వార సంతల్లో విక్రయిస్తున్నాడు. పంట పెట్టుబడి పోను ఆరు నెలల్లో రూ.30 వేల ఆదాయం సమకూరిందని రైతు గోపాల్ పేర్కొంటున్నాడు. ఒకే రకమైన పంటల సాగుతో కాకుండా వేర్వేరు రకాల పంటలను పండించడంతో నష్టాల నుంచి గట్టెక్కవచ్చునని గోపాల్ చెబుతున్నాడు.



కోతుల బెడదకు తోట చుట్టూ ఏర్పాటు చేసిన వల



అదనపు ఆదాయం పొందుతున్నా..

- అంతెర్పుల గోపాల్, రైతు

నాకున్న 11 గుంటల్లో మొదట వరి వేసేవాడిని. లాభం లేకుండాపోయింది. దాంతో పక్కనే ఉన్న ఎకరం భూమిని కౌలుకు తీసుకున్నాను. మొత్తం 1.11 ఎకరాల్లో 1.05 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటను వేశాను. 6 గుంటల్లో సేంద్రియ పద్ధతిలో కూరగాయలను పండిస్తున్నాను. కోతుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు తోట చుట్టూ వలను ఏర్పాటు చేశాను. వరి సాగుతో పాటు కూరగాయలను పండించడం వల్ల నెలకు రూ. 5వేల వరకు అదనపు ఆదాయం సమకూరుతోంది.

ఆర్టీవో అధికారులు వేధిస్తున్నారని నిరసన

● లారీ పైకి ఎక్కి విద్యుత్ తీగలు పట్టుకుంటానని బెదిరింపు



లారీ ఎక్కి నిరసన తెలుపుతున్న అనీల్‌గౌడ్

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) ఆర్టీవో అధికారులు మాముళ్ళ వసూలు చేస్తున్నారని శనివారం బసంత్‌నగర్‌కు చెందిన ముత్యం అనీల్‌గౌడ్ అనే లారీ ఓనర్ నిరసన తెలిపాడు. లారీ పైకి ఎక్కి కరెంటు తీగలు పట్టుకొని ఆత్మహత్యాయత్నం చేసుకుంటానని ఆందోళన చేపట్టాడు. ఈ సందర్భంగా అనీల్ మాట్లాడుతూ తనపై కక్ష గట్టి ఆర్టీవో అధికారులు లారీలపై కేసులు రాసి ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. లారీ గతంలో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్నప్పుడు అధికారులు ఆపి కేసు రాశారని, దానికి సంబంధించి జరిమానా శుక్రవారం చెల్లించానని, అదే రోజు మరో లారీకి ధ్రువపత్రాలు లేవని, మళ్లీ కేసు రాశారని వివరించారు. స్థానికులు, పోలీసులు నచ్చజెప్పడంతో పైనుంచి కిందికి దిగాడు. అయితే జిల్లా రవాణాశాఖ అధికారి రంగారావును వివరణ కోరగా ఏడున్నర నెలల క్రితం ఓవర్ లోడ్ కేసు నమోదైందని, దానికి సంబంధించి జరిమానా చెల్లించాడని, మరో లారీ పత్రాలు సక్రమంగా లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రవాణా అధికారులు మామూళ్ళకు పాల్పడితే కేసు నమోదు చేయరని, ఆయన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్థులు



కనగర్తిలో ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్థులు

కోనరావుపేట ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తి గ్రామ శివారులోని మూలవాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్థులు శనివారం అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన పర్మిషన్‌తో నడుస్తున్నప్పటికీ గ్రామస్థులు అడ్డుకున్నారు. ఇసుకను ట్రాక్టర్లతో తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి నీటి ఎద్దడి నెలకొంటుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తూ ఇసుకను తరలించకుండా అడ్డుకున్నారు. వేరే ప్రాంతం నుంచి ఇసుకకు పర్మిషన్ ఇవ్వాలని కోరారు.

గీత కార్మికుడికి గాయాలు

శంకరపట్నం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి జారిపడడంతో ఓ గీత కార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన కరీంపేట గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంపేట గ్రామానికి చెందిన గీతకార్మికుడు గుర్రం వీరస్వామి శనివారం సాయంత్రం వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు గుజి ఊడిపోవడంతో పట్టు కోల్పోయి చెట్టుపై నుంచి జారుతూ మధ్యలో వచ్చి ఆగాడు. గమనించిన గీత కార్మికులు వీరస్వామిని కిందకు దింపారు. ఈ ప్రమాదంలో వీరస్వామి దంతాలు విరగడంతో పాటు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం అతడిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



అంజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు

మల్యాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులు అంజన్నను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో కృష్ణప్రసాద్, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్న భారత్



మాట్లాడుతున్న అప్పాల ప్రసాద్‌జి

భగత్‌నగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): భారతదేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్నదని సామాజిక, సమరత వేదిక తెలంగాణ ప్రాంత సంయోజక్ అప్పాల ప్రసాద్‌జీ అన్నారు. శనివారం నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న స్వదేశీ మేళాలో ఆయన మాట్లాడుతూ స్వదేశీ పరిజ్ఞానం, ఆలోచనలతో వికసిత్ భారత్ వైపు అడుగులు వేస్తున్నదన్నారు. దేశం ఆర్థికంగా పురోగతి సాధించాలంటే స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలన్నారు. జపాన్ దేశం అణుబాంబును ఎదుర్కొని అణతి కాలంలోనే ఆర్థికంగా ఎదిగి అమెరికాతో పోటీ పడే స్థాయికి ఎదిగిందన్నారు. భారతదేశం 75 సంవత్సరాల తర్వాత ఆర్థికంగా అభివృద్ధి సాధించి 102 దేశాలకు అన్నపెడుతుందన్నారు. 168 ఆర్థిక ర్యాంకింగ్‌లో ఉన్న దేశం నేడు 5వ స్థానంతో దూసుకు పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వదేశీ జాగరణ్ మంచ్ కన్వీనర్ ముక్క హరీష్‌బాబు, కో-కన్వీనర్ కళ్లెం వాసుదేవరెడ్డి, వసంత్ వ్యాలీ కరస్పాండెంట్ ఇనుకొండ బుచ్చిరెడ్డి, సప్తగిరి హైస్కూల్ చైర్మన్ నగేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులు స్టార్టప్ కంపెనీల సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న కంపెనీ ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, రైతులు

జగిత్యాల అగ్రికల్చర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రైతులందరూ స్టార్టప్ కంపెనీల ఉత్పత్తులను, సేవలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ భారతీ నారాయణ్ భట్ అన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాస, జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ వారి ఆధ్వర్యంలో అగ్‌మార్క్ అగ్రిటెక్ మార్కెట్ ఆక్సెస్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సహ పరిశోధన స్థానం సంచాలకుల ఇంచ్‌ర్జి శ్రీనివాస్ మాట్లాడుతూ రూరల్ ఇన్నోవేషన్ స్టాక్స్ అందించే సేవలను అందిపుచ్చుకొని రైతులు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. శాస్త్రవేత్త రజినీదేవి మాట్లాడుతూ రూరల్ ఇన్నోవేషన్ స్టాక్స్, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు స్టార్టప్ సేవలను ఉపయోగించుకునేందుకు, గ్రామ ఆవిష్కరణలకు స్టాక్ అందించే విషయాన్ని వివరించారు. అనంతరం వివిధ కంపెనీలు తమ ఉత్పత్తులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. తదనంతరం స్టార్టప్ కంపెనీల ఉత్పత్తులైన రోబోట్స్, డ్రోన్స్‌ని క్షేత్రప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల్లోని 11 మంది రైతు ఉత్పత్తిదారుల సంఘాల బాధ్యులు, సీఈవోలు, రైతులు, స్వశక్తి సంఘాల మహిళలతో పాటు అగ్రిహబ్ సీఈవో విజయ్, నాబార్డు కరీంనగర్ ఏజీయం జయప్రకాశ్, ఇన్నోవేషన్ స్టాక్ రూరల్ స్టాక్ కోఆర్డినేటర్ రంజిత్ కుమార్, అగ్రిహబ్ మేనేజర్ ముఖేష్ పాల్గొన్నారు.

కల సాకారం

గోదావరి నదిపై పూర్తయిన సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం



సదర్‌మాట్ బ్యారేజీ

- 18 వేల ఎకరాలకు సాగునీరు
- త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి ఏర్పాట్లు

జగిత్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల-నిర్మల్ జిల్లాల సరిహద్దులో గల గోదావరి నదిపై సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం పూర్తి కావడంతో అన్నదాతల కల నెరవేరి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ గ్రామ శివారులో గోదావరి నదిపై సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం 2017 జనవరిలో ప్రారంభించగా ఎట్టకేలకు 2024లో పనులు పూర్తి అయ్యాయి. దీంతో జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లో 18 వేల ఎకరాల పంట భూములు సస్యశ్యామలం కానున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.554.28 కోట్ల నిధులు వెచ్చించి బ్యారేజీ నిర్మాణం చేపట్టారు. పనులు గతేడాది పూర్తి కావాల్సి ఉన్నా వరదలు రావడంతో పాటు, ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో పనులు ఆలస్యం అవుతూ వచ్చాయి. బ్యారేజీ నిర్మాణంతో జగిత్యాల, నిర్మల్ జిల్లాలలోని 500 మందికుపైగా రైతులకు చెందిన సుమారు 1230 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోమటికొండాపూర్, ఎర్దండి, మూలరాంపూర్, నిర్మల్ జిల్లా మామడ మండలం కమల్‌కోట, పోన్కల్, టెంబుర్ని, ఆదర్శనగర్ గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములు ముంపునకు గురికాగా బాధిత రైతులకు గత ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించింది.



బ్యారేజీపై నుంచి రహదారి

తీరనున్న సాగునీటి కష్టాలు

సదర్మాట్ బ్యారేజీ నిర్మాణంతో జగిత్యాల, నిర్మల్ జిల్లాలో 18 వేల ఎకరాల పంట పొలాలు సస్యశ్యామలం కానున్నాయి. జగిత్యాల జిల్లాలో 4,896 ఎకరాలకు, నిర్మల్ జిల్లాలో 13,120 ఎకరాల ఆయకట్టుకు రెండు పంటలకు సాగు నీరు అందనుంది. సదర్మాట్ బ్యారేజీ కింద గతంలో వేములకుర్తి శివారులో నిర్మించిన గంగానాల ప్రాజెక్టను నింపి అక్కడి నుంచి వివిధ గ్రామాలకు సాగునీరు అందించనున్నారు. గతంలో వేసవిలో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడేవారు. బ్యారేజీ నిర్మాణంతో జిల్లాలోని వేములకుర్తి, యామపూర్, ఫకీర్ కొండపూర్‌తో పాటు మల్లాపూర్ మండలం నడికుడ, మొగిలిపేట, ఒబులపూర్ గ్రామాల రైతులకు రెండు పంటలకు సాగు నీరు అందనుంది. ప్రస్తుతం సదర్‌మాట్ గేట్లు ఓపెన్ చేయడంతో చివరి ఆయకట్టు వరకు రైతులు సాగు చేయడంతో ఆ ప్రాంతం పచ్చని పంటలతో కళకళలాడుతుంది. సదర్మాట్ బ్యారేజీ పొడవు కిలోమీటర్ ఉండగా బ్యారేజీపై సుమారు 7.5 మీటర్ల వెడల్పుతో వాహనాలు వెళ్లే విధంగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. బ్యారేజీకి 55 గేట్లు బిగించారు. నిర్మాణం పూర్తి కావడంతో బ్యారేజీకి జలకళ సంతరించుకుంది.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే మరింత ప్రయోజనం

జగిత్యాల-నిర్మల్ జిల్లాల సరిహద్దులో గల గోదావరి నదిపై సదర్మాట్ బ్యారేజీ నిర్మాణం పనులు పూర్తి కావడంతో ఈనెల చివరి నాటికి ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యారేజీ ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు యోచిస్తున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మార్చి మొదటి లేదా రెండో వారంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం అవుతుందన్న అభిప్రాయాలను సంబంధిత వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. గోదావరి నదిపై నిర్మించిన సదర్‌మాట్ బ్యారేజీని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే మరింత ప్రయోజనం కలగనుంది. ప్రాజెక్ట్ నిర్మాణంతో ఇప్పటికే అక్కడ పర్యాటక శోభ సంతరించుకుంది. నిత్యం రెండు జిల్లాలకు చెందిన పర్యాటకులు ప్రాజెక్టును సందర్శిస్తున్నారు. ప్రభుత్వం చొరవ చూపి అక్కడ పార్క్, హోటల్స్, బోటింగ్‌తో పాటు వివిధ సౌకర్యాలు కల్పించి పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఇరు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించండి

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఊట్కూరి నరేందర్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పార్టీ శ్రేణులు, పట్టభద్రులకు పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి తరపున ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం అల్గునూర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పట్టభద్రుల దశదిశ పేరిట నిర్వహించిన మానకొండూర్ నియోజకవర్గస్థాయి పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఎన్నో మంచి పనులు చేసిందని, రెండు లక్షల రుణమాఫీ 90శాతం మందికి వర్తింపజేసిందని అన్నారు. వివిధ సాంకేతిక కారణాలతో 2 లక్షల రుణమాఫీ పొందని 10శాతం మందితో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయిస్తున్నారని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలో లేనపుడే పట్టభద్రులు గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డిని గెలిపించారని గుర్తు చేశారు. ఇప్పుడు పార్టీ అధికారంలో ఉన్నందున కాంగ్రెస్ అభ్యర్థిని తప్పకుండా గెలిపించుకోవాలని అన్నారు. ఓ అభ్యర్థి దేవుళ్ల పేరుతో ఓట్లు అడుగుతున్నాడని, పట్టభద్రులు, మేధావులు ఆలోచించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అద్భుతమైన పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. తనను గెలిపిస్తే విద్యారంగ అభివృద్ధికి, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పాటుపడతానని అన్నారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదగోని లక్ష్మీనారాయణగౌడ్ ఉన్నారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి

- రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

భగత్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పాలని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొంరయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌రెడ్డికి పడుతుందన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి రేవంత్‌రెడ్డి ఫ్రస్టేషన్‌లో ఉన్నాడన్నారు. కులగణన ఓ బోగస్ ప్రక్రియ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధాని మోదీ సామాజికవర్గం గురించి మాట్లాడే స్థాయి లేదన్నారు. కాంగ్రెస్ సర్కార్‌పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన కులగణన ఓ బోగస్ ప్రక్రియ అని హిందూ, ముస్లిం, బీసీ ముస్లిం అని ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. సర్వే లెక్కలు బోగస్ అనితేలడంతో మళ్లీ సర్వేకు అవకాశం ఇచ్చారన్నారు. తెలంగాణ ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలన్నారు. సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, మాజీ మేయర్లు డి శంకర్, వై సునీల్‌రావు, జిల్లా ప్రధానకార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



సిరిసిల్లలో హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్‌లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికై శనివారం బయల్దేరి వెళ్లినట్లు పాఠశాల కరస్పాండెంట్ రాజ్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఈ నెల 17 నుంచి 21 వరకు జరిగే ఆల్ ఇండియా ఇంటర్ డిస్ట్రిక్ట్ హ్యాండ్‌బాల్ నేషనల్ చాంపియన్‌షిప్ సబ్ జూనియర్ పోటీలకు ఇంగ్లీష్ యూనియన్ పాఠశాలకు చెందిన వర్షిత్, ప్రహర్షిత్, గుణభద్రలు ఎంపిక కాగా, వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ రాజశేఖర్, కోచ్ ప్రేమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేములవాడకు అదనపు బస్సులు

- మహాశివరాత్రికి ఏర్పాట్లు
- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి. రాజు



భగత్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని వేములవాడకు 778 అదనపు బస్సులు నడిపిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి పుణ్యక్షేత్రానికి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్ రీజియన్‌లలోని వివిధ డిపోల నుంచి అదనపు బస్సులు నడిపించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు అదనపు బస్సులు నడిపిస్తున్నామన్నారు తిప్పాపూర్ బస్‌స్టేషన్‌కు 443 బస్సులు, కట్టకింద బస్‌స్టేషన్‌కు 335 బస్సులు నడిపించేందుకు రూట్‌మ్యాప్ సిద్ధం చేశామన్నారు. వేములవాడతో పాటు, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని శైవక్షేత్రాలతో పాటు, భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం శైవక్షేత్రానికి అదనపు బస్సులు నడిపిస్తున్నామన్నారు.

- **కాళేశ్వరం** క్షేత్రానికి మంథని డిపో నుంచి మంథని-కాళేశ్వరానికి 26 బస్సులు నడిపిస్తున్నామన్నారు. భక్తుల రద్దీని బట్టి గోదావరిఖని, కరీంనగర్ నుండి అదనపు బస్సులు నడిపిస్తామన్నారు. వేలాల క్షేత్రానికి గోదావరిఖని డిపో నుండి గోదావరిఖని-వేలాలకు 56 బస్సులు, మంథని డిపో నుంచి మంథని-వేలాలకు 40 బస్సులు నడిపిస్తున్నామన్నారు. అదే విధంగా దుబ్బరాజన్న క్షేత్రానికి జగిత్యాల డిపో నుంచి జగిత్యాల-దుబ్బ రాజన్న రూట్‌లో 50 బస్సులు అదనంగా నడిపిస్తున్నామన్నారు. పొట్లపల్లి క్షేత్రానికి హుస్నాబాద్ డిపో నుంచి హుస్నాబాద్- పొట్లపల్లికి 23 అదనపు బస్సులు నడిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

వేములవాడ బస్‌స్టేషన్ నుంచి ఉచిత బస్సు

మహాశివరాత్రి పురస్కరించుకుని ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు భక్తుల సౌకర్యార్థం శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం వేములవాడ ఆధ్వర్యంలో 14 మినీ బస్సులు వేములవాడ బస్‌స్టేషన్(తిప్పాపూర్) నుంచి వేములవాడ దేవాలయం వరకు ఉచిత ప్రయాణ సేవలు అందిస్తాయన్నారు. భక్తులు వేములవాడ బస్‌స్టేషన్ నుంచి దేవాలయం వరకు తిరుగు ప్రయాణంలో దేవాలయం నుంచి బస్‌స్టేషన్ వరకు ఉచిత బస్సు ప్రయాణ సేవలను ఉపయోగించుకోవచ్చన్నారు. భక్తులు వేములవాడ క్షేత్రానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నడిపిస్తున్న బస్సు సర్వీసు సేవలను సద్వినియోగం చేసుకొని వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకోవాలన్నారు.

వేములవాడ (తిప్పాపూర్ బస్‌స్టేషన్‌కు)

డిపో	రూటు	బస్సులు
కరీంనగర్-1	కరీంనగర్-వేములవాడ	51
కరీంనగర్-2	కరీంనగర్-వేములవాడ	30
కోరుట్ల	కోరుట్ల-వేములవాడ	62
మెట్‌పల్లి	మెట్‌పల్లి-వేములవాడ	105
వేములవాడ	వేములవాడ-జెబిఎస్	84
వేములవాడ	వేములవాడ-కొండగట్టు జగిత్యాల	21
సిరిసిల్ల	వేములవాడ-వరంగల్	27
సిరిసిల్ల	సిరిసిల్ల-వేములవాడ	25
కరీంనగర్-1	వరంగల్-వేములవాడ	16
కరీంనగర్-2	వరంగల్-వేములవాడ	7
హుజూరబాద్	వరంగల్-వేములవాడ	15

వేములవాడ (కట్టకింద బస్‌స్టేషన్‌కు)

డిపో	రూటు	బస్సులు
నిర్మల్	నిర్మల్-వేములవాడ	83
ఆర్మూర్	ఆర్మూర్-వేములవాడ	100
నిజామాబాద్-1	నిజామాబాద్-వేములవాడ	17
కామారెడ్డి	కామారెడ్డి-వేములవాడ	33
నర్సంపేట్-	నర్సంపేట-మహబూబాబాద్ వేములవాడ	30
వరంగల్-1	వరంగల్-వేములవాడ	21
హన్మకొండ	వరంగల్-వేములవాడ	27
పరకాల	పరకాల-వేములవాడ	24

కేజ్ కల్చర్ ఏర్పాటుతో ముదిరాజ్‌లకు నష్టం



చీర్లవంచ శివారులోని మిడ్‌మానేరు వద్ద ముదిరాజ్ సంఘ నాయకులు

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మిడ్‌మానేరు డ్యాంలో కేజ్ కల్చర్‌ను ఏర్పాటు చేస్తే ముదిరాజ్ కులస్థులకు తీరని అన్యాయం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఆధారపడిన ముదిరాజ్ కులస్థులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చొక్కాల రాము, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు చొప్పరి రామచంద్రం డిమాండ్ చేశారు. తంగళ్లపల్లి మండలం చీర్లవంచ శివారులోని మిడ్‌మానేరు డ్యాంలో అక్వాహబ్ పేరుతో కేజీ కల్చర్‌ను ఏర్పాటు చేస్తున్న ప్రాంతాన్ని శనివారం జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజ్ కల్చర్‌ను ఏర్పాటు చేయడం వల్ల స్థానికంగా ఉన్న ముదిరాజ్ కులస్థులు, మిడ్‌మానేరు ప్రాజెక్టులో ముంపునకు గురైన నిర్వాసితులకు ఉపాధి కరువుతుందని అన్నారు. అక్వా పేరిట తమ భూములను తీసుకుని మధ్యమానేరు డ్యాంలో కేజ్‌కల్చర్ ఏర్పాటు చేస్తున్నారని దీనిని ముదిరాజ్ కులస్థులు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. వారికి ఉన్న అనుమతులు ఏమిటో చూపించి పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. స్థానికంగా ఉన్న ముదిరాజ్ కులస్థులకు ఉపాధికి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుం డా కేజ్ కల్చర్ కంపెనీలో పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్న ఆలయానికి పులిహోర ప్యాకింగ్ మిషన్ వితరణ

- గంటకు 2,100 ప్యాక్ చేసే సామర్థ్యం



పులిహోర ప్యాకింగ్ మిషన్

మల్యాల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రసాదాల పోటులో పులిహోర ప్యాకింగ్ మిషన్ ఏర్పాటు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వరదవెల్లికి చెందిన పీచర శ్రీహర్షరాజ్యలక్ష్మి అనే అంజన్న భక్తులు రూ.1.55లక్షలతో పులిహోర ప్యాకింగ్ మిషన్ కొనుగోలు చేసి దేవస్థానంకు కానుకగా అందించారు. శనివారం ఈవో కృష్ణప్రసాద్, పర్యవేక్షకులు చంద్రశేఖర్, సునీల్, హరిహర నాథ్, ప్రసాదాల ఇన్‌చార్జ్ శ్రీనివాస్ మిషన్‌ను ప్రారంభించారు. పులిహోర ప్యాకింగ్ మిషన్ దేవస్థానం నిర్దేశిత 200గ్రాముల పులిహోరను గంటకు 2,100 ప్యాకెట్లు చేయనుందని అధికారులు తెలిపారు. దీంతో సిబ్బందికి పనిభారం తప్పడంతో పాటు రద్దీ రోజుల్లో మరింత సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ



ధర్మపురి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాల నుండి క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. అనంతరం ఆలయాలకు చేరుకుని భక్తులు స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలబడ్డారు. భక్తులు వివిధ రకాల పూజల కోసం టిక్కెట్లు కొనుగోలు చేశారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణాలు చేశారు.. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. అందంగా పూలతో అలంకరించిన స్వామివారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, వంశీకృష్ణ, విజయ్, నరసింహమూర్తి, నవీన్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తిగీతాలతో ప్రతిధ్వనించాయి. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. భక్తులకు ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది సేవలు అందించారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి



పూల మాల వేస్తున్న రవీందర్‌సింగ్

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ మహరాజ్ 286వ జయంతిని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్యా ప్రేమ్‌నాయక్ ఆధ్వర్యంలో శనివారం కోతిరాంపూర్‌లో ఘనంగా నిర్వహించారు. సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి సంత్‌సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంతోపాటు స్వీట్లు పంపిణీ చేశారు. జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు శ్రావణ్‌నాయక్, యువజన కాంగ్రెస్ నాయకులు జేరిపోతుల వాసు, లకావత్ రవి నాయక్, గుగులోత్ విజయ్‌నాయక్, ప్రభాస్‌రాజ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలి

గణేశ్‌నగర్: సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలని ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ అన్నారు. శనివారం శాతవాహన విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో ఎస్సీ ఎస్టీ సెల్ బంజారా విద్యార్థులతో కలిసి సంత్ సేవాలాల్ జయంతి నిర్వహించారు. సేవాలాల్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని బంజారాలు ఇంకా అభివృద్ధి చెందాలన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రంగ ప్రసాద్, ఓఎస్డీ హరికాంత్, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సూరేపల్లి సుజాత పాల్గొన్నారు.

సామాజిక సంఘ సంస్కర్త సంతు సేవాలాల్ మహరాజ్ అని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమాసాహెబ్ అన్నారు. శనివారం రాంనగర్‌లో నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ 286వ జయంతిలో మాట్లాడారు. మూఢనమ్మకాలను రూపుమాపాలని కృషి చేసిన వ్యక్తి సేవాలాల్ మహరాజ్ అని కొనియాడారు. గిరిజన సంఘం నాయకులు లక్ పతి నాయక్, శ్రీనివాస్ నాయక్, శివ, దినేష్, శ్రావణ్, సింహాద్రి, కృష్ణ, మారుతి, రామ్, చరణ్, అజయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎదుట విగ్రహం ఏర్పాటు చేయాలి

భగత్ నగర్: సంత్‌సేవాల్ మహరాజ్ విగ్రహాన్ని పార్లమెంట్ ఎదుట ఏర్పాటు చేయాలని రాష్ట్ర సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్ అన్నారు. సేవాలాల్ జయంతి సందర్భంగా కొత్తపల్లి మండలంలోని చింతకుంటలో మేరామా సేవాలాల్ ఆలయ నిర్మాణంలో భాగంగా శనివారం నిర్వహించిన బోగ్ బండార్‌లో మాట్లాడారు. సంత్‌సేవాల్ జయంతిని దేశ వ్యాప్తంగా అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అడవి బిడ్డల సామాజిక సాంస్కృతిక జీవన విధానాన్ని కాపాడడం కోసం సేవాలాల్ కృషి చేశారన్నారు. కొత్తపల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ తిరుపతినాయక్, ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మోహన్‌నాయక్, కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రావణ్‌నాయక్, బీజేపీ నాయకులు సదానందంనాయక్, పూజారి భాస్కర్‌నాయక్, గోపి నాయక్, ఆలయ నిర్మాణ కమిటీ నాయకురాలు దశమిబాయి, డీటీవో చంద్రునాయక్, సరోజన, జీవన్ నాయక్ అంబిబాయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ ఉమేష్‌కుమార్



అన్నదానంలో సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

హుజూరాబాద్ : పట్టణంలోని తపాలా కార్యాలయంలో బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్టీ పోస్టల్ అసోసియేషన్ డివిజన్ నాయకుడు బానోత్ తిరుపతి నాయక్, ఏఐపీఈయూ రాష్ట్రఅధ్యక్షుడు ఊకంటి మహేందర్, తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.

అవీఇవీ

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజీపూర్, ఆసీఫ్‌నగర్, బావుపేటలోని 33/11కేవీ సబ్‌స్టేషన్ల మరమ్మతులో భాగంగా ఆదివారం విద్యుత్ సరఫరానిలిపివేస్తున్నట్లు రూరల్‌ఏడీఈ రఘు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

నేడు 'కలల లోగిలి' పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో నగునూరి రాజన్న కవిత్వం 'కలల లోగిలి' పుస్తకం ఆవిష్కరించనున్నట్లు సంస్థ బాధ్యులు కేవీ గోపాలాచార్య, వీఎల్ భవాని ప్రకటనలో తెలిపారు. సంస్థ అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన సాహితీ కిరణం.. సాహిత్య మాస పత్రిక సంపాదకుడు సుబ్బారావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ఆయిల్ పాంపై అవగాహన

భగత్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని బోనాలపల్లెలో రైతులకు ఆయిల్ పాం సాగుపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి కృష్ణ మాట్లాడుతూ రైతులు ఆయిల్ పాం సాగు చేయాలన్నారు. అనంతరం బోనాల పల్లెలో వరిలో క్షేత్ర సందర్శన చేశారు. ఏఈవో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అంజిరెడ్డికి మద్దతుగా ప్రచారం

భగత్‌నగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా పశ్చిమ జోన్ బీజేపీ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ప్రచారం నిర్వహించారు. ప్రభారి ఎర్రోళ్ల ప్రశాంత్, శ్రీనివాస్, రాములు తదితరులు పాల్గొన్నారు.

నరేందర్‌రెడ్డికి యాదవ పోరాట సమితి మద్దతు

సుభాష్‌నగర్,ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తెలంగాణ యాదవ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్ తెలిపారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరులతో మాటాడారు. 30 ఏళ్లుగా నరేందర్‌రెడ్డి ఎంతో మందికి విద్యనందిచారన్నారు

ఓటమి భయంతోనే దుష్ప్రచారం



వాకర్స్‌తో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఓటమి భయంతోనే కొందరు సామాజిక మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి ఆరోపించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డితో కలిసి శనివారం ఉదయం అంబేద్కర్ స్టేడియంలో వాకర్స్‌ను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విద్యాసంస్థల అధినేతగా ఎంతోమందిని విద్యావంతులుగా తీర్చిదిద్దానని, ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. కులమతాలకతీతంగా తాను సేవ చేస్తున్నానని, సామాజిక మాధ్యమాల్లో కొందరు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి ప్రాధాన్య ఓటును వేసి ఎమ్మెల్సీగా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

ఏడాదిలో 55 వేల ఉద్యోగాలు

గంగాధర: ఏడాదిలో 55వేల ఉద్యోగాలు కల్పించామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శనివారం గంగాధర మండలం మంగపేట ఫంక్షన్‌హాల్‌లో పట్టభద్రుల సమావేశంలో మాట్లాడారు. కులగణన సర్వే దేశానికే తెలంగాణ రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు. అనంతరం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి పట్టభద్రులకు వారధిగా నిలుస్తానన్నారు.

చిరుతల భజన పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కళాభారతిలో ఉదయం 9 గంటల నుంచి 15 గంటలపాటు నిర్వహించనున్న నిర్విరామ చిరుతల భజన ప్రదర్శన పోస్టర్‌ను శనివారం కలెక్టర్ పమేలా సత్పతి కళాభారతిలో ఆవిష్కరించారు. హుజూరాబాద్‌కు చెందిన కళారవళి సోసియో కల్చరల్ అసోసియేషన్, కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించనున్నారు. నిర్వాహకులు విష్ణుదాసు గోపాల్‌రావు, గుండ్ర కృపాదానం పాల్గొన్నారు.

గనులు, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్‌ను కలిసిన కలెక్టర్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మానకొండూర్, వీణవంక మండలాల్లో ఇసుక క్వారీలను సందర్శించేందుకు శనివారం కరీంనగర్‌కు వచ్చిన రాష్ట్ర భూగర్భ గనులు, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.శ్రీధర్‌ను కలెక్టర్ పమేలా సత్పతి మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఇసుక క్వారీల వివరాలను, ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను కలెక్టర్ వివరించారు. ఆర్డీవో మహేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఎస్సారార్‌లో ప్రవేశాలకు అధ్యాపకుల ప్రచారం

గణేశ్‌నగర్.ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): రాబోయే విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్) అధ్యాపకులు శనివారం వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రచారం చేపట్టారు. అందుబాటులో ఉన్న కోర్సులు, సౌకర్యాలపై విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ ప్రచారానికి వెళ్లిన అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

పారమితలో జాతీయ ఆవిష్కరణ దినోత్సవం



ఆవిష్కరణలను పరిశీలిస్తున్న కన్వీనర్ లలిత్ మోహన్‌సాహు

భగత్‌నగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పద్మనగర్‌లో పారమిత్ హెరిటేజ్ పాఠశాలలో జాతీయ ఆవిష్కరణ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు అంశాలపై ఆవిష్కరణలు తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఆవిష్కరణల మండల కన్వీనర్ లలిత్ సాహు, డైరెక్టర్ హనుమంతరావు, డైరెక్టర్స్ ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, రమణ, ప్రసాద్, వినోద్‌రావు, హన్మంతరావు, ప్రిన్సిపాల్‌లు గోపికృష్ణ, సమన్వయకర్తలు రవీంద్ర పాత్రో, భవానీ, నారాజు, రాము, అనిల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా పని చేసినప్పుడే దేశం అభివృద్ధి

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా నిస్వార్థంగా పని చేసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని సీనియర్ సిటిజన్ అండ్ ఫ్రీడమ్ ఫైటర్ ఆకుల ప్రభాకర్ పటేల్ అన్నారు. శనివారం తెలంగాణచౌక్‌లో 'స్వాతంత్ర్య సమరయోధుల ఆకాంక్ష ఇంతవరకు నెరవేర్చలేదు' అనే పోస్టర్‌ను శనివారం తెలంగాణ కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ ఆనంద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజేశ్వరరావు, ఓం ప్రసాద్, శ్రీధర్ రాజు, కిరణ్ కుమార్, రాజిరెడ్డి, బషీర్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కురుమ సంఘం భవనంలో శనివారం లాయర్స్ ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్ క్యాలెండర్‌ను ప్రముఖ న్యాయవాది నర్రి స్వామి కురుమ, జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు కడారి అయిలన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్రి స్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో సుమారు 50 లక్షల జనాభా ఉన్న కురుమ కులాన్ని చేర్చకపోవడం బాధాకరమన్నారు. కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు కడారి అయిలన్న కురుమ, కురుమ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్, ఉప్పల్ కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి పర్వతాలు పాల్గొన్నారు.

కొత్త ఇన్‌చార్జితో కాంగ్రెస్ మరింత బలోపేతం

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల కొత్త ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నియామకంతో రాష్ట్రంలో పార్టీ బరింత బలోపేతం అవుతుందని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మీనాక్షి నటరాజన్ నియామకం శుభపరిణామమని పేర్కొన్నారు.

బొమ్మగాని ధర్మభిక్షం త్యాగం చిరస్మరణీయం

భగత్‌నగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం త్యాగం చిరస్మరణీయమని గీతపనివారల సంఘం జిల్లా నిర్మాణ బాధ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్ అన్నారు. శనివారం నగరంలోని బద్ధం ఎల్లారెడ్డి భవన్‌లో బొమ్మగాని ధర్మభిక్షం 103వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మభిక్షం నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పేద బడుగు బలహీనవర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, పైడిపల్లి రాజుగౌడ్ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవాలు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం గోపాల్‌పూర్ మురళీ కృష్ణ ఆలయం గీతామందిరం 31వ వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం విష్ణు సేవానందగిరి స్వామి, ఆలయ ప్రధాన అర్చకుడు మధుసూదనాచారి ఆలయంలో గీతా నవగ్రహ హోమాన్ని ర్వహించారు. మహిళలు కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ గోనె ఎల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసయ్య, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) విద్యార్థుల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని ఎంఈవో రవీందర్ సూచించారు. శనివారం కరీంనగర్ మండలం నగునూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఫుడ్ ఫెస్టివల్స్ రంగవల్లి వంటి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే కార్యక్రమాలు చేపడుతున్న ఉపాధ్యాయులను అభినందించారు.



మాట్లాడుతున్న ఎంఈవో రవీందర్

ఇసుక రీచ్‌ను పునఃప్రారంభించాలి

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం చేగుర్తిలో ఇసుక రీచ్‌ను పునఃప్రారంభించాలని గ్రామంలోని ట్రాక్టర్ల యజమానులు కోరారు. ఇసుక రీచ్ ఏర్పాటు చేసేలా ఉన్నతాధికారుల ఆదేశాలు ఇప్పించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆన్‌లైన్ బుకింగ్ విధానం ద్వారా ఇసుక సరఫరా చేసి ఉపాధి పొందినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఆన్‌లైన్ బుకింగ్ లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



వినతి పత్రం అందిస్తున్న ట్రాక్టర్ల యజమానులు

కుర్మపల్లి రైతుకు జాతీయ అవార్డు



మల్లిఖార్జున్ రెడ్డి

చొప్పదండి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కుర్మపల్లికి చెందిన రైతు మాపురం మల్లిఖార్జున్‌రెడ్డికి జాతీయస్థాయి అవార్డు దక్కింది. ఐకార్ ఆధ్వర్యంలో ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ఫెలో ఫార్మార్ అవార్డును ప్రకటించింది. రాష్ట్రం నుంచి మల్లిఖార్జున్ రెడ్డి ఒక్కరికే ఈ అవార్డు దక్కడం విశేషం. ఈనెల 22న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును కేంద్రమంత్రి అందజేయనున్నారు. కాగా గతంలో మల్లిఖార్జున్‌కు ఇన్నోవేటివ్ ఫార్మర్ అవార్డు అందుకున్నారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన

గంగాధర/రామడుగు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలోని ఒద్యారం, రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను డీఈవో ఏర్పాటుచేసిన బృందం పరిశీలించింది. ఈసందర్భంగా 2024-25 విద్యాసంవత్సరానికి పదవతరగతి విద్యార్థులు రాసిన వివిధ పరీక్షల్లో వచ్చిన మార్కులు, సబ్జెక్టుల వారీగా పరిశీలించారు. బృందంలో టీం లీడర్ డాక్టర్ ఎలిగేటి మల్లికార్జున్, సభ్యులు నగేష్, భూమయ్య, ఎంఈవో ఏనుగు ప్రభాకర్‌రావు ఉన్నారు.

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

హుజూరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ ఎల్పీజీ డీలర్ల సంఘం అధికార ప్రతినిధి పీవీ మదన్‌మోహన్ అన్నారు. శనివారం హుజూరాబాద్ కేసీ క్యాంపులోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రేరణ కార్యక్రమంలో భాగంగా వంట గ్యాస్ వాడకం, జాగ్రత్తలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ముఖ్య సమన్వయకర్త రాము, సమన్వయకర్త ఇమ్తియాజ్, మేనేజర్ దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

వీణవంక, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలో కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి అన్నారు. శనివారం గ్రామకమిటీల ఎన్నికల్లో నాయకులకు దిశానిర్దేశం చేశారు. మండలంలోని శ్రీరాములపేట గ్రామశాఖ అధ్యక్షుడిగా మ్యాడగొని కుమారస్వామి, హిమ్మత్‌నగర్ అధ్యక్షుడిగా బండారి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా గెల్లు కొంరయ్య, లస్మక్కపల్లి అధ్యక్షుడిగా నలుగురి మధ్య తీవ్రపోటీ నెలకొనగా వారి పేర్లను అధిష్టానానికి పంపామన్నారు. వారం రోజుల్లో వారి ఎన్నిక జరుగుతుందన్నారు.

మానవ హక్కులపై అవగాహన

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఫిలిం భవన్ సొసైటీ హాల్‌లో సివిల్ ప్రొటెక్షన్ లీగల్ సర్వీసెస్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా సివిల్ ప్రొటెక్షన్ లీగల్ సర్వీసెస్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో మానవ హక్కులపైనా, డ్రగ్స్, రోడ్ సేఫ్టీపైనా శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాంటీ నార్కోటిక్స్ విభాగం సీఐ కృష్ణమూర్తి, ట్రాఫిక్ ఎస్సై ఉపేందర్, రమేష్, అడ్వకేట్ మొహమ్మద్ అబ్దుల్ సోహెల్, నాజియా, బండ గోపాల్‌రెడ్డి, చైర్మన్ షేక్ చాంద్ పాషా, సయ్యద్ సయీద్, ఖాజా గౌస్ మోయుద్దీన్, జిల్లా అధ్యక్షురాలు విస్సం రజితరెడ్డి, అహ్మద్, రిటైర్డ్ సీఐ మొహమ్మద్ షేర్‌అలీ, మొహమ్మద్ అఖిల్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం కోసమే సహకార సంఘాలు: ఎమ్మెల్యే

గంగాధర, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమంకోసం వ్యవసాయ సహకారసంఘాలు పనిచేస్తున్నాయని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సహకార సంఘాల పాలక వర్గ పదవీకాలం ముగియగా మరో ఆరునెలలు ప్రభుత్వం పొడగించడంతో కురిక్యాల,గంగాధర సింగిల్‌విండో అధ్యక్షులు తిరుమల్‌రావు, బాలగౌడ్ శనివారం ఎమ్మెల్యే మేడిపల్లిసత్యంను కలిసి సన్మానించారు. సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్,సహకార శాఖమంత్రికి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు.

సైదాపూర్/చిగురుమామిడి: వెన్కేపల్లి విశాల సహకారపరపతి సంఘం అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మునిపాలరవి, బొమ్మగాని రాజు, పల్లేని ప్రవీణ్‌రావు, మహిపాల్‌రెడ్డి, సంఘ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. చిగురుమామిడి మండలంలో సింగిల్ విండోచైర్మన్ జంగవెంకటరమణారెడ్డి, సంఘ సభ్యులు నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను సన్మానిస్తున్న సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల్‌రావు, తదితరులు

గురుకులంలో వైద్య శిబిరం

గంగాధర, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గంగాధర మహాత్మ జ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలలో శనివారం స్థానిక వైద్యురాలు శ్వేత ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు కంటి పరీక్షల తోపాటు అనారోగ్యంగా ఉన్నవారిని పరిశీలించి మందులు పంపిణీ చేశారు.

విగ్రహాల ప్రతిష్ఠాపనకు భూమిపూజ

వీణవంక, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతిగల్ గ్రామంలో భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి, పోచమ్మవిగ్రహాల ప్రతిష్ఠాపనకు శనివారం భూమిపూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకుడు నర్సింహాచార్యులు మాట్లాడుతూ వచ్చేనెల 3నుంచి 6వరకు భూలక్ష్మి, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన సృజన్ బ్యాంకాక్‌లో ప్రమాదంలో గాయపడగా, వారి కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పరామర్శించారు. సృజన్ దళితబంధు పథకం కింద జమ్మికుంట పట్టణంలో పెయింటింగ్ షాపును నడుపుతుండగా లక్కీడ్రాలో బ్యాంకాక్ ట్రిప్ రాగా, కంపెనీ తరపున వెళ్లాడు. అక్కడ ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సృజన్‌ను ఇక్కడికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని సృజన్ భార్య స్నేహ ఎమ్మెల్యేను వేడుకున్నారు. ఆయన సానుకూలంగా స్పందించి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఆయన వెంట జమ్మికుంట మాజీమున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, మాచనపల్లి మాజీ సర్పంచ్ పర్లపల్లి రమేష్ ఉన్నారు.



కంపెనీ ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

నాటిన ప్రతి మొక్కనూ కాపాడాలి



శంకరపట్నం మండలం తాడికల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

శంకరపట్నం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నాటిన ప్రతిమొక్కనూ కాపాడి భావితరాలకు ప్రాణవాయువు అందించాలని మండలవిద్యాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం మండలంలోని తాడికల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రివల్యూషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిగా హాజరైమాట్లాడారు. ప్రతిఒక్కరూ మొక్కలునాటి భూమాతను కాపాడాలన్నారు. మట్టి, గాలి, నీరు,కలుషితం కాకుండా చూడాలన్నారు. అనంతరం పుడమినాయకులను ఎన్నుకొని బ్యాడ్జీ ప్రదానంచేశారు. కార్యక్రమంలో సీజీఆర్ ప్రోగ్రాంఆఫీసర్ నగేష్, జిల్లాబాధ్యులు మామిడి శంకర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఔషధ మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన

ఇల్లందకుంట: మండలకేంద్రంలోని జడ్పీఉన్నతపాఠశాలలోని విద్యార్థులకు ఔషధమొక్కలపెంపకం వాటిఉపయోగంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ప్రోగ్రాం ఆఫీసర్ పాలడుగు నరేష్, జిల్లాఇన్‌చార్జీ మామిడిశంకరయ్య విద్యార్థులను చిన్నప్పటినుంచే పర్యావరణ పరిరక్షణకై నాయకత్వ లక్షణాలను పెంపొందించేదిశగా ప్రేరేపించాలన్నారు. అనంతరం పాఠశాలలోని 6నుంచి 9వతరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరినీ తరగతికిఇద్దరు చొప్పున పాఠశాల ఎర్త్‌క్లబ్ సభ్యులుగాఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంజయప్రకాష్, ఉపాధ్యాయులు రాధిక, సుధాకర్, వేణు,శంకర్,సమ్మిరెడ్డి,అన్నపూర్ణ పాల్గొన్నారు.



ఇల్లందకుంటలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ప్రోగ్రాం ఆఫీసర్లు

కాశీవిశ్వనాథ స్వామి కల్యాణం

చిగురుమామిడి,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి) :మండలంలోని చిన్నముల్కనూర్‌లో శనివారం అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథుని (శివ) కల్యాణం నిర్వహించారు. సాయంత్రం శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రామడుగు,ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో గతనెల నిర్వహించిన ప్రతిభ పోటీల్లో మండలంలోని వెలిచాల గ్రామంలోని సరస్వతీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభచాటి బహుమతులు అందుకున్నట్లు కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపింది.

బీజేపీదే ఘన విజయం

ఇల్లందకుంట, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ, పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి ఘన విజయం సాధిస్తాడని బీజేపీఓబీసీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కొత్తశ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎన్నికలప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టుభద్రుల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రసన్న హరికృష్ణ గెలుపు కోసం విస్తృత ప్రచారం

చిగురుమామిడి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 15: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా శనివారం మండలంలోని బొమ్మనపల్లి, ఇతర గ్రామాల్లో బీసీ సంఘాల నాయకులు, బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ విస్తృత ప్రచారం నిర్వహించారు. హరికృష్ణను గెలింపించాలని కోరారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు ఎరబెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జమ్మికుంట నుంచి కాంగ్రెస్‌నాయకులు తరలివెళ్లారు. ఈసందర్భంగా రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ సమగ్ర కులగణనద్వారా అన్ని వర్గాలకు సంక్షేమపథకాలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.